క్లుప్తంగా

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొనండి

తెనాలిఅర్బన్: పట్టణంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, 39వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గెద్దేటి ఝాన్సీవాణి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 39వ వార్డులో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో పర్యటిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలు, రోడ్లను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

+ తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తెనాలిని చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో పలువురు మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, స్కూల్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక ఆదివారం ఉదయం జరుగుతుందని ఏపీ యూత్ టీ-20 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ భాస్కర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్ ఆవరణలో గల యువ క్రికెట్ అకాడమీలో ఎంపిక జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, వైట్ యూనిఫామ్‌తో సెలక్షన్స్‌కు రావాలన్నారు. ఎంపికైన జట్టు అక్టోబర్ 8 నుండి 12 వరకు గోవాలో జరుగనున్న నేషనల్ టీ-20 క్యాష్ ప్రైజ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. వివరాలకు 7989215572 నంబరులో సంప్రదించాలన్నారు.

'మణిపాల్'కు ఎన్‌ఏబీహెచ్ డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణం మహానాడు ప్రాంతంలోని మణిపాల్ హాస్పిటల్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌ఏబీహెచ్) డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్ గోల్డ్ లెవల్ లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ గౌరవాన్ని అందుకున్న మొదటి, ఏకైక ఆసుపత్రిగా మణిపాల్ హాస్పిటల్ నిలిచిందన్నారు. భారతదేశంలోని మొదటి 100 ఆసుపత్రులలో ఒకటిగా మణిపాల్ నిలిచిందని చెప్పారు. రోగి డేటా ఇప్పుడు పూర్తిగా డిజిటల్‌గా రికార్డ్ చేయబడి, అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఏ సమయంలో అయినా రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయడానికి వీలు కలుగుతుందన్నారు. తద్వారా తిరుగులేని సంరక్షణ సమన్వయాన్ని నిర్ధారిస్తుందని తెలిపారు. ఈ డిజిటల్ హెల్త్ రికార్డుల కారణంగా బీమా క్లెయిమ్‌ల ప్రక్రియ వేగంగా ట్రాక్ చేయగలమన్నారు. ఎన్‌ఏబీహెచ్ డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్‌ను అవార్డును స్వీకరించిన వారిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉత్తమ్ శర్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ వసంత, ఐటీ లీడ్ జహీద్ హుస్సేన్ తదితరులు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో క్వాలిటీ లీడ్ డాక్టర్ బి. రమేష్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం



కొల్లూరు: అగ్ని ప్రమాదం సంభవించి ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని రావికంపాడులో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చెరుకూరి చార్లెస్ భార్య తమ గృహంలో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగసిపడి పూరింటికి అంటుకున్నాయి. మంటలు ఇల్లు మొత్తం వ్యాపిస్తుండటంతో చార్లెస్ భార్య కట్టుబట్టలతో బయటకు వచ్చి చుట్టుపక్కల వారిని సహాయం కోసం పిలవడంతో వారు అప్రమత్తమై మంటలను అదుపుచేశారు. అప్పటికే గృహం మొత్తం మంటలు వ్యాపించి సామగ్రి మొత్తం దగ్ధం అవడంతో సుమారు రూ.50 వేలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లుబాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలను ఆదుకోవాలి

బాపట్ల: పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అఖిలభారత రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ పేర్కొన్నారు. సంఘం కార్యాలయం నుంచి శుక్రవారం ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో మేకల ప్రసాద్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించటంలో ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ పట్టణ కార్యదర్శి మువ్వల పల్లవి, పీఓడబ్ల్యూ డివిజన్ కార్యదర్శి జె.కల్పన, పీఓడబ్ల్యూ మండల అధ్యక్షులు కొండా అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎవరైనా చేస్తామన్నది ముందే చెప్పి ఆనక దాన్ని అమలు చేసి చూపిస్తారు. కానీ కూటమి నేతలు పాలనలోకి వచ్చేందుకు హామీలు గుప్పించి ఇవాళ వాటి ఊసే మరచిపోయిన వైనాన్ని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. నాడు ఓట్లు వేయించుకునేందుకు, ఓటర్ల మనసు గెలుచుకునేందుకు గొప్పలకు పోయి ఇచ్చిన హామీల ఊసు ఇవాళ చూద్దామన్నా కనపడటం లేదు. ఇచ్చిన హామీల వైపునకు ఈ వంద రోజుల్లో పాలకులు ఒక్క అడుగు వేసింది లేదు. సూపర్ సిక్స్ పేరిట ఓటర్లను నమ్మించారు. తెనాలి నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను ఇవాల్టికీ పట్టించుకోకపోవడం అందరూ గమనించాల్సిన విషయం.



పెదరావూరు-తెనాలి మధ్య నాలుగు వరసల రహదారి


హామీల ఊసు అంతా తుస్సు!!

- వంద రోజుల పాలనలో చేసిందేమీ లేదు
- ఆ దిశగా ప్రయత్నమూ లేదు!
- గత వైభవ శిలాఫలకాల ధ్వంసం తప్పు!

తెనాలి: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైంది. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను గుప్పించిన కూటమి నేతలు, ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటుచేశాక, హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని ప్రకటనలు మినహా ఆచరణలో చేసింది లేదు. తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన సీనియర్ రాజకీయనేత నాదెండ్ల మనోహర్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల్లో స్థానిక ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చింది లేదు. కనీసం ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించిన దాఖలా లేదు. మరోవైపు గత ప్రభుత్వంలోని పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లపై కేసులు బనాయించారు.

ఎన్నికల వేళ మనోహర్ ఇచ్చిన హామీలివే

- మహిళలను నైపుణ్యం ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తాం.
- డిజిటల్ అక్షరాస్యత, ఆధునిక మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తాం.
- రూ.10 లక్షల ఆర్థికసాయంతో వారు ఉపాధిని పొందటం మాత్రమే కాకుండా మరో పది మందికి ఉపాధిని అందించేలా చేస్తాం
- ఆధునిక ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను తీసుకొస్తాం.
- నైపుణ్యాభివృద్ధి, అర్హత గలవారికి రూ.10 లక్షల రుణాలు ఇప్పిస్తాం.
- పొదుపు సంఘాలకు రూ.3-10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు.
- యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరీక్షలకు సన్నద్ధతకోసం డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి తెస్తాం.
- చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పిస్తాం
- గతంలో నేను ప్రతిపాదించినట్టుగా మార్కెట్ సెంటర్లో ఆకాశ నడక వంతెన నిర్మిస్తాం
- అదేవిధంగా తెనాలిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేస్తాం.
- గంజాయి రహిత తెనాలిగా చేస్తాం
- రేషన్ బియ్యం అక్రమ రవాణాను నిరోధిస్తాం



తెనాలిలో ఏప్రిల్ 15న ఎన్నికల ప్రచార సభలో కూటమి నేత పవన్‌కళ్యాణ్ హామీలు

- ఆంధ్రాప్యారిస్ పేరుకు తగినట్టుగా సుందరీకరిస్తాం.
- పట్టణంలోని మూడు కాల్వలను బాగుచేయించి సుందరంగా చేస్తాం.
- పట్టణంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించే బాధ్యత తీసుకుంటాం
- కొల్లిపరలో చెక్‌డ్యామ్ నిర్మించి ముంపు గ్రామాల ప్రజలకుఇబ్బంది లేకుండా చూస్తాం
- పెదరావూరు-నందివెలుగు నాలుగు వరసల రోడ్డును పూర్తిచేస్తాం.

తెనాలిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం సహా వివిధ అభివృద్ధి పనులపై విజన్ డాక్యుమెంట్-2047ను ఈ నెలాఖరుకల్లా ప్రకటిస్తామని మంత్రి నాదెండ్ల ఇటీవల ఒక ప్రైవేటు సభలో ప్రకటించారు. మరో 23 ఏళ్లకు చేసే పనులపైనే ఆ డాక్యుమెంట్ ఉంటుందని చెబుతున్నారు. అంటే ఇచ్చిన హామీల అమలుకు కాలయాపన కోసమేనన్న అనుమానం స్థానికులకు కలుగుతోంది. కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించటం మాట దేవుడెరుగు... మున్సిపాలిటీలో టీడీపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల్లో మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 150కి పైగా 'ఏపీ కాస్' అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తొలగింపు నోటీసులిచ్చారు. అయితే వరదలు రావటంతో సహాయక డ్యూటీలు అప్పగించారు. మెడపై తొలగింపు కత్తి వేలాడుతూనే ఉందని ఆందోళన పడుతున్నారు. మరోవైపు గంజాయి రహిత తెనాలిగా చేస్తామన్న హామీ ఇప్పట్లో జరిగేలా కనిపించటం లేదు. ఎప్పటికప్పుడు గంజాయి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు ఏడు కేసుల్లో 34 మందిని అరెస్టు చేశారు. 10కిలోల 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో అక్రమంగా నిల్వవుంచిన రేషను బియ్యం పట్టుబడటం కూడా బియ్యం అక్రమ రవాణా కూడా కొనసాగుతోందని చెప్పేందుకు మరో నిదర్శనం.



ఈనాడు పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మనోహర్ హామీలు



మంచినీటి పథకం పైప్‌లైన్ లీకేజీ

పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచార సభలో మనోహర్ హామీలు

- మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారం రోజుల్లోనే తెనాలిలో ఎక్కడా గంజాయి లేకుండా చేస్తా.
- తెనాలి-విజయవాడ నాలుగు వరసల రహదారి అందుబాటులోకి తెస్తా
- ముస్లిం యువతకు కంప్యూటర్ శిక్షణతో ఆధునిక ఉపాధి మార్గాలు చూపుతా
- ఎస్సీల శ్మశాన వాటికల సమస్యలు పరిష్కరిస్తా
- బీసీలకు వారి కోరిన విధంగా సామాజిక భవనాలు ఏర్పాటుచేయిస్తా
- కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో నెలకు రూ.4 వేలు పింఛను మినహా ఇతర ఏ హామీలు ఇప్పటికీ అమలు కావటం లేదని తెలిసిందే.
- బడులు తెరిచి ఎంతోకాలమైనా తల్లికి వందనం, ఖరీఫ్ సీజను నడుస్తున్నా రైతుభరోసా డబ్బులు ఇంతవరకు ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో కనీస ప్రకటన లేదు.
- ఇకపోతే నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తికాలేదు. వడ్డీ లేని రుణాలు, ఆర్థికసాయం వంటి హామీలను పట్టించుకోవటం లేదు. యువతకు జాబ్ క్యాలెండర్ అతీగతి లేదు. ఇక అభివృద్ధి పనుల నిర్మాణం ఏదీ వందరోజుల్లో నెరవేర్చటం సాధ్యం కాదనుకుందాం...చిత్తశుద్ధి ఉంటే, కనీసం ఒక్క పనికైనా భూమి పూజయినా చేసివుండాలి కదా! అంటున్నారు. పెదరావూరు-నందివెలుగు మధ్య నాలుగు వరసల రోడ్డు పూర్తిచే సే పనులు అటుంచి, ఇప్పటి వరకు నిర్మించిన రోడ్డు మెయింటెనెన్స్‌ను కూడా చేయటం లేదు. ఇంటింటికీ మంచినీటి సరఫరా హామీ సంగతి సరే, పథకం లీకేజీలు ఇప్పటికీ వెలుగుచూస్తున్నాయి.

కొబ్బరి బొండాలు రహదారులపై వేయవద్దు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: కొబ్బరి బొండాలను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. పట్టణంలోని కొబ్బరి బొండాల వ్యాపారులతో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల వెంట కొబ్బరి బొండాలు పెట్టుకునే వారు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అలాగే త్రాగిన కొబ్బరి బొండాలను ప్రత్యేకమైన స్థలంలో వేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏసీపీ జడ్. సుధాకర్, వ్యాపారులు పాల్గొన్నారు.

మళ్లీ ఇరుక్కుపోయిన లారీ!



తెనాలిఅర్బన్: వైకుంఠపురం రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. మిక్సర్ లారీ బ్రిడ్జికి వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లకు తగలడంతో వాహనం నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్ సుమారు గంట పాటు నిలిచిపోయింది. వివరాలోకి వెళితే తెనాలి నుంచి పెదరావూరు వైపు మిక్సర్ లారీ వెళ్తుంది. వైకుంఠపురం బ్రిడ్జి దాటగానే ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్ల కంటే లారీ ఎత్తుగా ఉండటంతో డ్రైవర్ వాహనాన్ని నిలిపివేశారు. ఇంతలో వెనుక నుంచి అనేక వాహనాలు వచ్చి అక్కడ నిలిచిపోయాయి. మిక్సర్ లారీ ముందుకు వెనుక వెళ్ళ లేక అక్కడే నిలిచిపోయింది. దీంతో చాలాసేపు ఈ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది.

ఏఎన్నార్ ఒక నటవిశ్వవిద్యాలయం

ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో మా-ఏపీ అధ్యక్షుడు దిలీప్‌రాజా

తెనాలి: ప్రముఖ సినీనటుడు నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతిని మా-ఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలపాటి నగర్‌లోని రత్న ఫార్చ్యూన్ కల్యాణమండపంలో జరిగిన వేడుకలకు మా-ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. ఆ మహానటుడిపై శతజయంతి రోజున పోస్టల్ స్టాంపు విడుదలపై హర్షం ప్రకటించారు. ప్రతి పాత్రకు ప్రాణం పోసిన మహానటుడు అక్కినేని నాగేశ్వరరావని ఆయన కొనియాడారు. నటనలో అక్కినేని ఒక నట విశ్వవిద్యాలయంగా ఆయన అభివర్ణించారు. తాగుబోతులను, ప్రేమలో ఓడిపోయిన వ్యక్తులను దేవదాసుగా కొందరు నేటికీ అంటున్నారంటే, ఆపాత్రలో అక్కినేని నటన ఎవరెస్ట్ అంత ఎత్తులోను, మహా సముద్రమంత వైశాల్యంలో ఉండటమే కారణమన్నారు .దేవదాసు,ప్రేమాభిషేకం, మాయాబజార్, మేఘసందేశం సినిమాలు తెలుగు చలనచిత్ర సీమలో చెరగని ఆస్తి అన్నారు.



మాట్లాడుతున్న దిలీప్‌రాజా, పక్కన కొత్త సుబ్రహ్మణ్యం, రత్నాకర్

ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన పర్సనాలిటీకి తగిన పాత్రలనే ఎంపిక చేసుకొని ఆయా పాత్రలకు నూరుశాతం న్యాయం చేసినందునే అక్కినేనిని పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు వరించాయని చెప్పారు.
దర్శకుడు రత్నాకర్, నటుడు వెలగా సుభాష్ చంద్రబోస్, మిలటరీ ప్రసాద్,రావూరి సురేష్ బాబు, బెల్లంకొండ వెంకట్, కొండముడి జయకర్, డాక్టర్ భూషణం, రమణయ్య, బసవయ్య పాల్గొన్నారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్‌లో ప్రత్యేక శిక్షణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ కురగల్లులోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో శుక్రవారం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఒకేషనల్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. ఆంటని రాజు, ఒకేషనల్ టీచర్ పి.ఝాన్సీ పాల్గొని, మాట్లాడారు. తమ పాఠశాలలో ఒకేషనల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు 150 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశారని, ఈ ఎడ్యుకేషన్ టూర్ కారణంగా ఎలక్ట్రానిక్స్ పరిజ్ఞానంపై మరింత అవగాహన పెంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, కల్యాణి, సరోజ, రాజశేఖర్ రెడ్డి, సుష్మ లత పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



తాడికొండ: తాడికొండ మండలంలో రెండు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు శుక్రవారం అండర్ -14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించారు. విజేతలను ఎంపిక చేశారు. మండల కో-ఆర్డినేటర్ వై.రాజారెడ్డి, పీఈటీలు సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, గురుస్వామి, జగదీష్ రెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి దోమలే ప్రథమ శత్రువులు

తెనాలిఅర్బన్: ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులు అని 16వ వార్డు కౌన్సిలర్ దివి అనిత పేర్కొన్నారు. మలేరియాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చినరావూరు తోట, వైకుంఠపురం కాలనీలో వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. చిన్న దోమ పెనుప్రమాదమని, అవికుడితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. శుక్రవారం రోజు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పట్టణ సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల రామప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కౌన్సిలర్ అనిత, మలేరియా అధికారులు

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి విచ్చేశారు. మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో స్త్రీ శక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 60 రోజుల పాటు శిక్షణ పొందిన 63వ బ్యాచ్ మహిళలు 50 మందికి కుట్టు మిషన్లు అందజేశామని చెప్పారు. రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీ దేవి మాట్లాడుతూ కుటుంబంలో మహిళ పాత్ర చాలా కీలకమని, స్వయం ఉపాధి సాధించడం ద్వారా కుటుంబం ఆర్థికంగా నిదొక్కుకుంటాయన్నారు. ఈ ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ స్త్రీ శక్తిని నెలకొల్పి, శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల పార్టీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత, దుగ్గిరాల ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, గుంటూరు పార్లమెంట్ తెలుగు మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఉన్నం ఝాన్సీరాణి, అలేఖ్య పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆరుద్ర భూలక్ష్మి, ఎంపీపీ షేక్ జబీన్

ఎన్‌ఎస్‌ఎస్‌ఎం స్కూల్లో ప్రారంభమైన క్రీడల పోటీలు

తెనాలిఅర్బన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన క్రీడల పోటీలను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసూనదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం త్రోబాల్, పరుగు పందెం, జంపింగ్ వంటి పోటీలను నిర్వహించారు. 25 మంది వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగే పోటీల్లో 250 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు చెప్పారు. శనివారం వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెనాలి మండల కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఎఎస్. నాగిరెడ్డి, పీఈటీలు రవీంద్ర, భాస్కర్, రమేష్, హరనాథ్, శివశంకర్, గోవింద్, గోవర్ధన్, నాగమణి, మానస, హెప్సిబా, శిరీష, బేగం, సాంబ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.



త్రోబాల్ గేమ్‌ను పరిశీలిస్తున్న నిర్వాహకులు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు యోగా శిక్షణ

భట్టిప్రోలు: దివ్య బాబాజీ ఫౌండేషన్ (భీమవరం) ఆధ్వర్యంలో భట్టిప్రోలులో టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ నిర్వాహకులు ఎ.ఉమాదేవి, ఎ. సీతారామరాజు, జీజీ ప్రసాద్ విద్యార్థులతో ఆసనాలు వేయించారు. క్రమం తప్పకుండా అభ్యసన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సి.రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి. మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాతాదారుల ఆదరణతో బ్యాంకు పురోగమనం

తెనాలి: ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ, తెనాలి 23 వసంతాలుగా సభ్యులు, ఖాతాదారుల ఆదరణతో పురోగమిస్తోందని సొసైటీ ఛైర్మన్ డీఎల్ కాంతారావు వెల్లడించారు. సొసైటీ ఆధ్వర్యంలో ది కాకతీయ కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రస్తుతం 10 శాఖలతో నడుస్తూ 2023-24 సంవత్సరానికి రూ.533 కోట్ల టర్నోవర్‌తో రూ.2.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు చెప్పారు. ఈనెల 22వ తేదీన సర్వసభ్య సమావేశం సందర్భంగా శుక్రవారం సొసైటీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మొత్తం డిపాజిట్లు రూ.117 కోట్లు కాగా, రుణాలు రూ.114 కోట్లు ఉన్నట్టు తెలిపారు. తనఖా రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలను ఇస్తుండగా, డిపాజిట్లపై జాతీయ బ్యాంకులకన్నా అత్యధికంగా డిపాజిట్లపై 11 శాతం వడ్డీని అందిస్తున్నామని తెలిపారు. బంగారు రుణాలపై 13 శాతం, ఇళ్లు, ఇళ్లస్థలాల హామీపై, వ్యక్తిగత జామీనుపై 15 శాతం వడ్డీతో రుణాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. రుణాల మంజూరు, రికవరీలోనూ అగ్రగామిగా ఉండటం గర్వకారణమన్నారు. వీరితో సొసైటీ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, దావూరి చక్రధర్ చౌదరి ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎల్ కాంతారావు

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం

నిజాంపట్నం: స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దటంతో గ్రామంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడవులదీవి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పలుస్వచ్ఛత కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, అప్పుడే స్వచ్ఛగ్రామంగా రూపుదిద్దుకుంటుందన్నారు. ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపదార్థాలను తడిచెత్త-పొడి చెత్తగా వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని, లేకుంటే నిర్దేశిత ప్రాంతంలో పడవేయాలని చెప్పారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు చెత్త బుట్టలను అందజేశారు. గ్రామంలో రహదారిని పరిశుభ్రపరచి, బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆలిన్, వార్డు మెంబర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

